ప్రజాశక్తి
గురువారం 16 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి





ఐద్వా నూతన రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు

చైతన్య భరితం.. భవిష్యత్ దిశానిర్దేశం..!

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ బుధవారం సాయంత్రంతో ముగిసింది. మూడు రోజులపాటు అనంతపురం నగరంలోని ఎంకెఎం ఫంక్షన్ హాలులో ఉత్తేజపూరిత వాతావరణంలో రాష్ట్ర మహాసభ జరిగింది. రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం.. భవిష్యత్తు పోరాటాలపై మహాసభ వేదికగా సుదీర్ఘ చర్చలు జరిపారు. మహాసభలు ఆద్యంతం అర్థవంతంగానూ, నిర్మాణాత్మంగానూ జరిగాయి. ఐద్వా మహిళా సంఘాన్ని రాబోయే రోజుల్లో మరింత అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామంటూ ప్రతినిధులు ఉద్యమ చైతన్య స్ఫూర్తితో తెలియజేశారు.



మహాసభలకు హాజరైన ఐద్వా ప్రతినిధులు

- అనంతలో ముగిసిన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ
- మూడు రోజుల పాటు ఉత్సాహభరితంగా మహాసభలు
- మహిళా సమస్యలపై సుదీర్ఘచర్చలు
- భవిష్యత్తు పోరాటాలపై కార్యాచరణ
- ఐద్వా నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక
- జిల్లా నుంచి ఐదుగురికి చోటు



మహాసభల ముగింపు సందర్భంగా అభివాదం చేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మూడు రోజుల మహాసభలో జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమతి టీచరు, మరియం ధావలేలతోపాటు కోశాధికారి పుణ్యవతి పాల్గొన్నారు. రాష్ట్ర మహాసభల మొత్తాన్ని వారు పరిశీలించారు. మొదటి రోజు బహిరంగ సభతో మహాసభ ఆరంభమైంది. ఈ మహాసభ ప్రారంభోత్సవానికి సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ విచ్చేశారు. ఆమె ప్రస్తుతం దేశంలో పరిస్థితులు ఏ రకంగా ఉన్నాయన్నది వివరించారు. మతోన్మాదం పెచ్చుమీరిపోయి హింస పెరుగుతోందని చెప్పారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా మహిళలు ఐక్యమై పోరాడాలని సూచించారు. రెండవ రోజు రాష్ట్రంలో ఐద్వా చేపట్టిన కార్యక్రమాలను కార్యదర్శి రమాదేవి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం జిల్లాల వారీగా ప్రతినిధులు చర్చల్లో వారి జిల్లాలోని మహిళల పరిస్థితులు వాటి పరిష్కారానికి ఐద్వా చేపట్టిన కార్యక్రమాలు అన్నింటినీ సమీక్షించారు. రోజంతా సుదీర్ఘంగా ఈ చర్చలు నడిచాయి. రాష్ట్రంలో ప్రధానంగా మైక్రో ఫైనాన్స్ ఆగడాలు మితిమీరిపోతున్నాయని, ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారని చర్చల్లో తెలిపారు. వడ్డీ రేట్లు 200 శాతం కంటే ఎక్కువగా ఉంటున్నాయని చర్చించారు. వీటిని కట్టడి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై పోరాటాలకు సన్నద్ధమవ్వాలని చర్చించారు. డ్వాక్రా సంఘాల్లో అవినీతిపెరగడం ఒక ఎత్తైతే, బ్యాంకులు కూడా అధిక వడ్డీలు వీరి నుంచి వసూలు చేస్తున్నాయన్న అంశం రెండో రోజు చర్చల్లో ముందుకొచ్చింది. మహాసభ మూడవ రోజు సబ్ కమిటీలు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై లోతుగా చర్చించారు. రాబోయే కాలంలో ఎటువంటి కార్యక్రమాలను రాష్ట్రంలో ఐద్వా చేపట్టాలని భవిష్యత్ కార్యచరణ రూపొందించారు. ఇదే సమయంలో ఐద్వాను మరింత బలోపేతం చేయడానికి ఎటువంటి కృషి రాష్ట్రంలో జరగాలన్న దానిని ఐద్వా జాతీయ నాయకులు మరియం ధావలే, శ్రీమతి టీచర్, ఎస్.పుణ్యవతిలు దిశానిర్ధేశం చేశారు. దేశంలో మతత్వం పెరుగుతన్న నేపథ్యంలో ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం బిజెపితో కలసి కూటమిగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చే ప్రయత్నాలు పెరిగే అవకాశమందని చెప్పారు. అందుకై ఐద్వా ప్రజల మధ్య ఐక్యత పెంచే దిశగా కృషి ఉండాలని జాతీయ నాయకులు సూచించారు. మొత్తంగా మూడు రోజులపాటు నగరంలో జరిగిన మహాసభలు అర్థవంతంగానూ, నిర్మాణాత్మంగానూ జరిగాయి. ఉత్సహపూరిత వాతావరణంలో చర్చలు జరిగాయి. ఈ మహాసభకు వచ్చిన ప్రతినిధులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఐద్వా మహిళా సంఘాన్ని రాబోయే రోజుల్లో మరింత అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామంటూ ఉత్సహంతో వెనుదిరిగి వెళ్లారు.

జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలోకి ఐదుగురు



ఐద్వా నూతన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతో జాతీయ నాయకులు

అనంతపురం జిల్లా నుంచి రాష్ట్ర కమిటీకి ఐదుగురు సభ్యులు ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా నుంచి ఒకరు ఎన్నికయ్యారు. అనంతపురం జిల్లా నుంచి ఎన్నికైన వారిలో వి.సావిత్రి ఐద్వా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గతంలో రాష్ట్ర కోశాధికారిగా ఉన్నారు. ఇప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ కార్యవర్గంలో చంద్రిక ఎన్నికవగా, శ్యామల, అశ్విని, జ్యోతిలు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా నుంచి శ్రావణి ఎన్నికయ్యారు.

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఏపీఐఐసి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో ఏపీఐఐసీ పరిశ్రమల భాగస్వామ్య డ్రైవ్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పారిశ్రామిక వాడలోనూ పరిశ్రమలలోను నెలరోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు వారాల షెడ్యూల్ ప్రకారం పారిశుధ్యం, పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమం, కొత్త పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై పారిశ్రామికవేత్తలతో సదస్సులు, కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రస్తుతమున్న పారిశ్రామిక వాడలలో మౌలిక సదుపాయాలు ఆధునీకరణ తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని వారిచేత పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశ్రామికీకరణకు అనుగుణంగా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజరు దేవకాంతమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

సమ్మెను విజయవంతం చేయండి : సిపిఎం



సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలన్న డిమాండ్‌తో చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన పార్టీ నాయకులతో కలసి బుధవారం సిపిఎం స్థానిక కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి జరుగుతున్న ఈ సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. వారి పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొంటామని విద్యుత్ కార్మికులందరూ ఐక్యంగా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జేఎల్ఎం గ్రేడ్-2ఉద్యోగులకి ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్సును వర్తింపచేసి ప్రమోషన్ ఇవ్వాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు 4 పెండింగ్ డిఎలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్ సి కమిటీని వేసి ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరికి అన్ లిమిటెడ్ వైద్య సౌకర్యం కల్పించాలని కోటి రూపాయలు ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జి ఎల్ నరసింహులు, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, మండల కన్వీనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : విద్యుత్‌కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుండి జరిగే సమ్మెలో అవుట్‌సోర్సింగ్, పీస్ రేట్ మీటర్ రీడర్స్ నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రయివేటీకరణ విధానాలను తిప్పి కొట్టాలన్నారు. కాంటాక్ట్ కార్మికులకు సంస్థలో విలీనం చేయాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాంబశివ, జగన్మోహన్, రామ్మోహన్, బాబ్జాన్, సుధాకర్ రెడ్డి, గిరి నాయక్, కాంట్రాక్ట్‌ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలకేంద్రంలోని బీసీ కాలనీలో కొన్ని నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆకాలనీవాసులు కోరారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య మంగళవారం స్థానిక బిసికాలనీలో పర్యటించారు. మహిళలు ఆయనను చుట్టుముట్టి సమస్యలను వివరించారు. కొళాయిల్లో బురద, దుర్వాసనతో నీరు వస్తోందని, పిల్లలు జ్వరాలు, వాంతులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పలుమార్లు వచ్చి చూసి వెళ్లిపోయారని, కానీ సమస్యకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. పైపులైన్ లీకులు వెంటనే సరిచేసి, సురక్షిత నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, గౌరీ శంకర్, మల్లికార్జున, చిన్న ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



తమ సమస్యను ఏకరువు పెడుతున్న కాలనీవాసులు

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి డైరెక్టర్లు శెట్టిపి పద్మ, శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవల గురించి వివరించారు. భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నతో సహా అనేక అవార్డులు పొందిన ఆయన తన సరళమైన జీవితం, స్ఫూర్తిదాయకమైన ప్రసంగాల ద్వారా దేశవ్యాప్తంగా ముఖ్యంగా యువతలో ఎంతో ప్రజాదరణ పొందారన్నారు.అనంతరం కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు కాలేజ్ సర్కిల్లో ఆయన విగ్రహానికి పూలదండలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా ధర్మవరం పట్టణ కాలేజీ సర్కిల్ లో అబ్దుల్‌కలాం విగ్రహానికి వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల అమరనాథ్ రెడ్డి, పురుషోత్తం రాయల్ చెన్నారెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : అత్యంత సామాన్య కుటుంబం నుంచి జీవితాన్ని ప్రారంభించి.. భారతదేశ అత్యున్నత రాష్ట్రపతి పదవి చేపట్టడంతో పాటు రక్షణ రంగంలో మిస్సైల్ మెన్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటి తరం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎ పి జె అబ్దుల్ కలాం 94వ జయంతి ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం కమిటీ గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసులు, టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు, ఎం.ఎన్.మూర్తి, త్రివేంద్ర నాయుడు, ఎనుముల రామకృష్ణ, అంగడి రామాంజనేయులు, రమణమ్మ, షమీ, బాబుల్ రెడ్డి, టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుదర్శన్, అధ్యాపకులుపాల్గొన్నారు.

హిందూపురం : నేటితరం విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆలోచనలను ఆచరణలో పెట్టాలని బిట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.రమేష్ సూచించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా లేపాక్షి మండలం చోళసముద్రం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం హరి ప్రసాద్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి సమన్వయకర్తపై కార్యకర్తల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ సమన్వయకర్త దీపిక

పార్టీ సమావేశంపై కనీస సమాచారం ఇవ్వరా..?
పార్టీకోసం పనిచేసిన వారికి ప్రాధాన్యతలేదా అంటూ నిలదీత

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆపార్టీ సమన్వయకర్త తీరుపై నిరసన వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ కమిటీనికి వేయడానికి అక్కడికి వెళ్లిన వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికకు చేదు అనుభవం ఎదురైంది. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ కష్టకాలంలో పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులను దూరం పెట్టి ఇంటిమనుషులతో రాజకీయం చేస్తే ఊరుకునేది లేదని వైసిపి మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, లేపాక్షి ఎంపీపీ వెంకటరత్నమ్మ, జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమన్వయకర్త బాధ్యతలు తీసుకున్న మనిషి అందర్నీ కలుపుకోకుండా సీనియర్లకు కనీస గౌరవాన్ని ఇవ్వకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజల చేత జెడ్పిటిసిగా ఎన్నుకోబడిన నాయకుడు కొండూరులో ఉన్నప్పుడు ఆయనకు ఏమాత్రం విలువ ఇవ్వకుండా సొంతమనుసులతో కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని దీపికాను ప్రశ్నించారు. కనీసం పార్టీ గుర్తుతో గెలిచి న ప్రజాప్రతినిధులను కలుపుకుని ముందుకు వెళ్లకపోతే భవిష్యత్తులో ప్రజా సమస్యలను ఎలా తెలుసుకుంటారని సొంత మనసులకు న్యాయం చేయలేనప్పుడు నియోజకవర్గానికి ఏమి చేస్తారని వారు బహిరంగ విమర్శలకు దిగారు. ఇన్‌ఛార్జి పని తీరుపై పార్టీ అధిష్టానానికి తెలియజేసి వైసిపి కాపాడుకుంటామని నాయకులు అన్నారు.

పార్టీకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తాం : పార్టీకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక అన్నారు.కొండూరు గ్రామ పంచాయతీలో వైసిపి కుటుంబ సభ్యుల ఆత్మీయ సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తను గుర్తించి గ్రామ కమిటీలలో చోటు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి మండల కన్వీనర్ సయ్యద్ నిసార్, కొండూరు గ్రామపంచాయతీ వైసిపి నాయకులు రమేష్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోండి

మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం విక్రయిస్తున్న ప్రభుత్వం అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు బైటాయించారు. కల్తీ మద్యం అరికట్టాలి, ఎన్ బ్రాండ్ కల్తీ మద్యం నిలిపివేయాలి, సీఎం డౌన్ డౌన్, కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వమే మద్యం విక్రయించిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే కూటమి నేతలు కల్తీ మద్యం అమ్మకాలకు తెర లేపారని ఆరోపించారు. ఆ నెపమంతా వైసిపి నాయకులపై వేయడం కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వానికి పారిపాటి అయిందన్నారు. కల్తీ మద్యం, బెల్ట్ షాపులు రాష్ట్రవ్యాప్తంగా విక్రయిస్తుంటే ఇంటెలిజెన్స్ అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వైసీపీ పాలలో కల్తీ మద్యంతో 30 వేల మంది మృతి చెందారని ఆనాడు గగ్గోలు పెట్టిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ కల్తీ మద్యంలో కూటమి నాయకులు అధికారులు భాగస్వాములుగా ఉన్నారన్నారని విమర్శించారు. సత్యసాయి జన్మించిన పుట్టపర్తి లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, జూదం, గంజాయి అమ్మకాలు జరుగుతున్నా వాటిని అరికట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి గోవింద నాయక్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ రవి నాయక్, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, నాయకులు ఆవుటాల రమణారెడ్డి, కులశేఖర్, ఆరు మండలాల కన్వీనర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న వైసిపి నాయకులు

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ లో మునిసిపల్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల ఆర్.పి.లు, ఓ.బిలు నిర్వహించిన ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ సక్రమంగా చేతుల శుభ్రం చేసుకోవడం వల్ల శ్వాసకోశ, ప్రేగు సంబంధిత వ్యాధులను 25 నుంచి 50శాతం తగ్గే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతు, వాసు, మెప్మా డిఎంసి ఎల్.గంగులయ్య, సిఒ గంగరత్నమ్మ, శ్రీ సత్య సాయి జిల్లా పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి, సమాఖ్య ఒబిలు, అన్ని సమాఖ్యల ఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్ : మడకశిర పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు కోరాఉఉ. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రపంచ హ్యాండ్ వాష్ డేను నిర్వహించారు. హ్యాండ్ వాష్ ప్రక్రియను శాస్త్రీయ పద్ధతిలో ఎలా అనుసరించాలో హెల్త్ సెక్రటరీలు వివరించారు. మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ మాట్లాడుతూ ప్రపంచ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని ప్రతి సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, సిఒ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సూచనల మేరకు పార్టీ అనుబంద సంఘాల అధ్యక్షుల నియకాలను ఎమ్మెల్యే కార్యదర్శి బాలాజి బుధవారం విడుదల చేశారు. తెలుగు యువత అధ్యక్షులుగా తలుపుల భార్గవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా భారతి , బిసి సెల్ అధ్యక్షులుగా రాజశేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా రవికుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా అశ్వర్థప్ప, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా అన్వార్ ఖాన్‌లను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు, తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు 'కోగిర' విద్యార్థులు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని కోగిర జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం అనంతపురం ఆర్డిటి స్టేడియంలో జరిగిన అండర్ – 19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలలో 8వ తరగతికి చెందిన ఎం. శంకర్ సూర్య, 9వతరగతికి చెందిన హరీష్ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు చెప్పారు.వీరు ఈనెల గుంటూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం, పీడీ మహేష్ తెలిపారు,

ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం

ప్రజాశక్తి - అమడగూరు

మండలంలోని ఆయా గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ మునెప్ప సూచించారు. బుధవారం మండలంలోని జౌకలకొత్తపల్లి గ్రామ పంచాయతిలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఈ విషయంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించి నీటి పరీక్షలు నిర్వహించారు. వాటర్ ట్యాంక్ మరియు చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునియ, సచివాలయ సిబ్బంది, శాంతి, బిక్షావతి, పారిశుధ్య కార్మికులు ప్రజలు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని నాయన పల్లి గ్రామంలో అధికారులు బుధవారం పారిశుధ్య చర్యలుచేపట్టారు. వాటర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, చెత్త తొలగింపు తదితర కార్యక్రమాలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, మెడికల్ సిబ్బంది ప్రసాద్, సుబ్రహ్మణ్యం పంచాయతీ రాజ్ ఇంజనీర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి - అమడగూరు

మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఒ శ్రీనివాస్ నాయక్, ఎఎస్ఒ నాగేంద్ర, మండల వ్యవసాయ అధికారి వెంకటరమణాచారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ : పంటకోత ప్రయోగాలపై మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ హర్షవర్ధన్ రెడ్డి, ఎఒ అబ్దుల్ హక్, వ్యవసాయ విస్తరణ అధికారి రంగాచారి, రైతు సేవా కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోనిపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సిపిఆర్‌పై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి డాక్టర్ షాహిద్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా కోఆర్డినేటర్ బి, రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ జి, మల్లికార్జున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హార్ట్ ఎటాక్ వస్తే సిపిఆర్ ఏ విధంగా చేయాలో డాక్టర్ షాహిద్ డమ్మీ హ్యూమన్ బాడీ ద్వారా విద్యార్థినులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఫ్యాన్ అందజేత

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువు శాఖ గ్రంథాలయానికి దాతలు 10 లైట్లు, ఒక ఫ్యాన్ ను బుధవారం అందజేశారు. పాఠకులు చదువుకోవడానికి ఇక్కడ ఇబ్బందికరంగా ఉందని తెలుసుకున్న దాతలు గాజుల నాగేంద్ర ప్రసాద్, శ్రీకాంత్, ప్రసాద్, గాజుల వీరశేఖర్ వీటిని బుధవారం గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్య తేజ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

రైతులు సేంద్రీయ, రసాయన ఎరువులు మాత్రమే వాడుతున్నారని , రైతులకు కొంత వరకే జీవన ఎరువులపై అవగాహన ఉందని ఎఒ రాజేష్ అన్నారు. బుధవారం మండలంలోని దొడగట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కే రామసుబ్బయ్య మాట్లాడుతూ జీవన ఎరువులు, జీవ సిలింద్ర నాసికాల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్ వితరణ

ప్రజాశక్తి - రొద్దం

రొద్దం మండల పరిషత్ పాఠశాలకు రూ. 10వేలు విలువ చేసే సౌండ్‌బాక్స్‌ను దాత వితరణ చేశారు. మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ ఈ. ఉమాదేవి కుమారుడు, టిడిపి నాయకుడు ఈ. పవన్ కుమార్ పాఠశాలకు బుధవారం సౌండ్ సిస్టమ్‌ను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగని ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల ఆగ్రహం



బస్సు వెనుక అద్దం పగిలిన దృశ్యం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ఉదయం నుండి తమ గమ్యస్థానాలకు వెళ్లాల్సిన గ్రామస్తులు, విద్యార్థులు పడిగాపులు కాస్తున్న సమయంలో బస్టాప్‌లో బస్సులు నిలపని కారణంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్సు అద్దాలను పగలగొట్టారు. ఈఘటన బుధవారం కొత్తచెరువు మండల పరిధిలోని లోచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు ప్రయాణికులు తెలిపిన వివరాలు... కొత్తచెరువు –పెనుగొండ ప్రధాన రహదారిలో కొత్తచెరువుకు వెళ్లడానికి ప్రయాణికులు, విద్యార్థులు లోచర్ల బస్టాండ్‌వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు. పెనుగొండ వైపు నుండి వచ్చిన ప్రతి బస్సు ఓవర్ లోడ్‌తో రావడం ఈ స్టేజి నందు నిలపలేదు. దీంతో విసిగిపోయిన ప్రయాణికులు హిందూపురం నుండి కొత్తచెరువుకు వస్తున్న ఏపీ 39 టిఎఫ్ 1342 నెంబరు గల బస్సును ఆపాలని కోరారు. అయితే బస్టాప్ వద్ద బస్సును ఆపకపోవటంతో ఆగ్రహించిన ప్రయాణికుల్లో కొంతమంది

బస్సు అద్దాలు ధ్వంసం

బస్సు వెనుక వైపున అద్దాలకు రాయిని బలంగా విసిరారారు. దీంతో బస్సు వెనుక వైపు అద్దం పగిలిపోవడంతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు .అనంతరం బస్సు డ్రైవరు, కండక్టర్ బస్సును నిలిపి చూడగా రాళ్లు విసిరినవారు అప్పటికే అక్కడినుండి తప్పించుకున్నారు. ఇదే విషయాన్ని ఆర్టీసీ సిబ్బంది కొత్తచెరువు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కర్నూలులో నిర్వహించే ప్రధానమంత్రి సభకు కొన్ని బస్సులు కేటాయించడంతో ప్రతి డిపో పరిధిలో సర్వీసులను కొన్నింటిని రద్దుచేసి ప్రధానమంత్రి సభకు తరలించారు. దాంతో బస్సుల్లో ఎక్కువ రద్దీ నెలకొందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

హాస్టళ్ల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి : సిపిఎం



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి - కొత్తచెరువు

బిసి సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక బిసి బాలుర హాస్టళ్లను ఎస్ఎఫ్ఐ నాయకులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అదేవిధంగా వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు దోమల ప్రభావం పడకుండా కిటికీలకు నెట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు అనుగుణంగా మరుగుదొడ్లు లేవని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టళ్ల అభివృద్ధికి ఉప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, సిఐటియు స్థానిక నాయకులు ముత్యాలు, బుక్కపట్నం మండల కార్యదర్శి బ్యాల అంజి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వికలాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం : గ్రామ, వార్డు సచివాలయ వికలాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ డిమాండ్ చేశారు. బుధవారం హిందూ పురంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ప్రతినిధులతో జరిపే చర్చల్లో వికలాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని జేఏసీ నాయకులను కోరారు. సమాజంలో వికలాంగ ఉద్యోగుల స్థితిగతులను, వారి దీన పరిస్థితి అర్థం చేసుకొని వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వికలాంగ ఉద్యోగులకు నాలుగు శాతం రిజర్వేషన్లతో సీనియార్టీ ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

కొత్తచెరువు : ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షలకు దరఖాస్తుకు గడువు పొడిగించినట్లు డీఈవో కిష్టప్ప తెలిపారు. డిసెంబర్ 7వ తేదీ ఈ పరీక్ష జరుగుతుందని ఇందుకు అర్హులైన వారు ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను 29వ తేదీ విద్యాశాఖ వారి లాగిన్ లో ధ్రువీకరించడం జరుగుతుందన్నారు. ఇందుకు జిల్లా పరిషత్ మున్సిపల్ ఎయియిటెడ్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతిలో 55 శాతం మార్కులు వచ్చినవారు అర్హులన్నారు. ఇందులో ఎస్సీ ఎస్టీ వారికి 50 శాతం మార్కులు ఉండాలన్నారు. కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.3.50లక్షలకు మించరాదన్నారు.

కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ధర్మవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు మూడు రోజులపాటు విధులు బహిష్కరిస్తున్నట్లు ధర్మవరం కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కరీం, ప్రధాన కార్యదర్శి డిఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షులు నూరుల్లా బుధవారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ను ఏర్పాటు చేయాలని ఎన్ని వినతులు చేసినా ప్రయోజనం కన్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఉండడం వల్ల రాయలసీమ ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వాలు మారిన న్యాయవాదుల సమస్య పరిష్కరించడం లేదని విమర్శించారు. అందుకే ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా కోర్టు విధులకు మూడు రోజులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

గూగుల్‌తో ఒప్పందం చారిత్రాత్మకం : టిడిపి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ డేటా సెంటర్ ఏపీలోని విశాఖలో ఏర్పాటు చేయడం ఎంతో చారిత్రాత్మక నిర్ణయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్ర మోదీ కి, ఏపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ,రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మన పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో ముందు చూపుతో అమెరికా తర్వాత ఒక భారీ స్థాయి ఐటీ కంపెనీ గూగుల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన సంస్థ సీఈవోకు కృతజ్ఞతలు తెలిపారు.

మడకశిర టౌన్ : గూగుల్ రాకతో విశాఖపట్నం పూర్తిగా అభివృద్ధి చెందుతుందని లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుచ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ మంగళవారం ఒప్పందం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

హిందూపురం : అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ డేటా సెంటర్‌కు విశాఖ వేదిక కావడం గొప్ప విషయమని.. అమెరికా తర్వాత ఏపీకే ఈ డేటా సెంటర్ రాబోతుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ విషయంపై బుధవారం టిడిపి నాయకులు పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, నాగరాజు మాట్లాడుతు చంద్రబాబు నేతృత్వంలో పదేళ్లల్లో ఏపీ స్వరూపం మొత్తం మారిపోతుందని అన్నారు. నవంబర్ 15న ఇన్వెస్ట్‌మెంట్ మీట్ విశాఖలో జరగబోతోందని.. ఆర్థిక రాజధానిగా విశాఖ ఆదర్శంగా నిలవబోతుందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేష్, పరిమళ, ఆర్ఎంఎస్ షఫీవుల్లా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా నీటితో చెరువులను నింపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి అర్బన్

నియోజకవర్గ పరిధిలోని చెరువులన్నిటిని హంద్రీనీవా నీటితో నింపాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక రోడ్డు భవనాల అతిథి గృహంలో బుధవారం హెచ్ఎన్ ఎస్ఎస్, ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెరువును కృష్ణాజలాలతో నింపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నియోజ కవర్గం పరిధిలో తలుపుల మండలంలో కొండారెడ్డి చెరువుతోపాటు మిగతా చెరువులకు కాలువ నీరు వెల్లడంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

విశ్రాంత ఉపాధ్యాయుడికి పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి-హిందూపురం

తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడికి ఆరోగ్యం దెబ్బతినిందన్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సహకారం అందించి ఆదుకున్నారు. హిందూపురం రూరల్ మండలం కె.బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–2003 వ సంవత్సరంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రాఘవేంద్ర వెన్నెముక నరంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు అస్లాం, శ్రీనాథ్, బాబాజాన్, నవీన్ తమ వంతు సహకారంగా రూ.40,500లను బుధవారం అందించారు. అనారోగ్యం బారిన పడి బుక్కరాయసముద్రంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడి ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్య చికిత్సల నిమిత్తం ఈ మేరకు ఆర్థిక సహకారం అందజేశారు.



విశ్రాంత ఉపాధ్యాయుడికి సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సత్యసాయి జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి కే సురేష్ బాబు బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఇస్తున్న ఈ టీ కాల విధానాన్ని వ్యాధి నిరోధక టీకాలు ఉంచు గదిని, సిబ్బంది హాజర పట్టికను, సిబ్బంది పని విధానాన్ని పరిశీలించారు. వైద్యులు సమ్మెలో ఉండటం వలన మిగతా సిబ్బంది ప్రజలకు సరైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ హెల్త్ ఆఫీసర్ వన్నప్ప, సూపర్వైజర్ రవీంద్ర, ల్యాబ్ అసిస్టెంట్ మాలతి, హెల్త్ అసిస్టెంట్ షాజహాన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయ భద్రతపై సమీక్ష

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాకేంద్రంలోని పుట్టపర్తి విమానాశ్రయ భద్రత చర్యలపై శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం విమానాశ్రయ డైరెక్టర్, కలెక్టర్లు, కమిటీ సభ్యులు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రతి ఏడూ రెండు పర్యాయాలు ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు ఇందులో భాగంగా బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విమాన ఆశ్రయ డైరెక్టర్, కమిటీ సభ్యులు విమానాశ్రయంలో తీసుకుంటున్న భద్రత చర్యలు గురించి పలు సూచనలు చేశారు. అనంతరం విమానాశ్రయ డైరెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సమావేశంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

భూసారాన్ని సంరక్షించుకుందాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్


రైతులు భూసారాన్ని సంరక్షించి అధిక దిగుబడును పొందాలని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ సిఎస్ రాజశేఖర్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం పెడబలి గ్రామంలో బుధవారం కలెక్టర్ శ్యాంప్రసాద్, జర్మన్ అంబాసిడర్ డాక్టర్ ఫిలిప్ అకేర్మెన్ బృందం ఆధ్వర్యంలో రైతు ఆంజనేయులు నాయక్ సాగు చేసిన పొలాన్ని పరిశీలించారు. ఇన్పుట్స్ బీజామృతం, ఘనా జీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీ విధానాల గురించి వివరించారు. ఆంజనేయులు నాయక్ సాగు చేసిన పూతదశలో ఉన్న కంది పంట నేల స్వభావాన్ని గమనించారు. విజయబాయ్ సాగు చేసిన వేరుశెనగ పంటను, సుధాకర్ రెడ్డి సాగు చేసిన వరి పంటను పరిశీలించి రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. గ్రామంలోని హనుమంత్ నాయక్ బి ఆర్ సి సెంటర్ ను సందర్శించారు.మహిళ సంఘాల సభ్యులతో, గ్రామసంఘం సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జర్మన్ అంబాసిడర్ డాక్టర్ దిలీప్, కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడుతూ వ్యవసాయ విధానాలను ఇంత గొప్పగా చేస్తున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ స్టేట్ టీం మురళీధర్ , వరప్రసాద్ బృందం, డిఎఒ రాము నాయక్, డిహెచ్ఒ చంద్రశేఖర్, డిపిఎంటీం రేంద్ర కుమార్, నవీన్, వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - మడకశిర టౌన్

తన కూతురును హాస్టల్ వదలివెళ్లడానికి వెళ్లిన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని సిరా నేషనల్ హైవే కొడగారు గుట్టసమీపంలో బుధవారం చోటు చేసుకుంది. మండలం గోవిందపురం గొల్ల హట్టి చెందిన సిద్ధప్ప మొదటి సంవత్సరం చదువుతున్న తన కుమార్తె సింధును అగలి లోని ఆదర్శ కళాశాలలో వదిలేందుకు తన బావ దేవరాజుతో కలసి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. కుమార్తెను హాస్టల్లో వదిలి తిరిగి తన స్వగ్రామానికి వస్తూ ఉండగా కొడగా రుల గుట్ట సమీపంలోఎదురుగా వచ్చిన ద్విచక్రవాహం తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో సిద్ధప్ప, దేవరాజు తీవ్ర గాయాలపాలయ్యారు. హైవే అంబులెన్స్ వారు హుటాహుటిగా మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు అప్పటికే సిద్ధప్ప(40) మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తీవ్ర గాయాలపాలైన దేవరాజును మెరుగైన చికిత్స కోసం హిందూపురానికిరిఫర్ చేశారు అయితే 108 ఈఎంటి రాజ్ కుమార్ అరగంట అయినా హిందూపురం తీసుకెళ్లేందుకు అంగీకరించలేదు. పై అధికారుల అనుమతి కోసం కాలయాపన చేశాడు. దీంతో దేవరాజ్ కుటుంబ సభ్యులు 108 సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దేవరాజుకు చెవిలో రక్తం కారి తలకు బలమైన దెబ్బలు తగిలాయని మెరుగైన చికిత్స కోసం హిందూపురం వెళ్లాలని వైద్యాధికారులు సూచించిన 108 వారు జాప్యం చేయడం తగదని వాపోయారు. ఒక ప్రభుత్వ ఆసుపత్రి నుండి రోగులను తీసుకెళ్లాలంటే పై అధికారుల అనుమతి తప్పనిసరి అని అంబులెన్స్ వాహనదారులు పేర్కొంటున్నారు ఈ కొత్త నిబంధన వల్ల ఏమాత్రం ఆలస్యమైనా రోగుల పరిస్థితి ఆందోళనకరమే.



108 సిబ్బందితో బాధితుల వాగ్వాదం

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఆటో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘించి రాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మునీర్ అహ్మద్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం బాగేపల్లి నుండి చెక్ పోస్ట్ కు అధిక లోడుతో వస్తున్న ఆటోలను తనిఖీ చేశారు. ఆటో డ్రైవర్లు తప్పని సరిగా యునిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్.సి ఉండాలని చెప్పారు. ఇవేవీ లేకుండా డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాలకులకు సమస్యలు పట్టవా.?

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణము లోని 40వ వార్డులో నెలకొన్న సమస్యలు పాలకులకు, అధికారులకు పట్టవా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వార్డులోని గుట్టకింద పల్లి పాఠశాల పరిస్థితిని అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న సాక్షర భారత్ పాఠశాలను మూసివేసి, వార్డు లో మరొక చోట అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని అన్నారు. ఇదే భవనానికి మరమ్మతులు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - లేపాక్షి

టపాసుల విక్రయ దారులు నిబంధనలు పాటించాలని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి దేశించారు. తాత్కాలిక టపాసుల దుకాణ దారులతో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వ నిబంధనలను వివరించారు. దుకాణదారులకు ఏడుగురు దరఖాస్తు చేసుకోగా నలుగురికి అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ప్రమీలమ్మ, మండల సర్వేయర్ సుమిత్ర, ఎఎస్ఐ నారాయణ స్వామి, గ్రామ రెవిన్యూ అధికారులు దుకాణదారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ పనుల్లో భాగంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వద్ద నుంచి యూనియన్ బ్యాంక్ వద్ద ఉన్న కల్వర్ట్ లోకి కలుపుతున్నారు. ఈ మురికి నీరు యూనియన్ బ్యాంక్ వద్ద కల్వర్టు నుంచి రైల్వే ట్రాక్ కింద మోరి గుండా వంకలోకి వెళ్లాలి. అయితే యూనియన్ బ్యాంక్ వద్ద కల్వర్టు నుండి రైల్వే ట్రాక్ మోరీ వరకు పూడిక పేరుకుపోయింది దీంతో మురికినీరు నిల్వ ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోతున్నారు. సమస్యను పరిష్కరించేవరకు పనులు నిలిపివేయాలని 13వ వార్డుకు చెందిన మహిళలతో పాటు తెలుగు మహిళా అధ్యక్షురాలు పి రాధమ్మ తదితరులు డిమాండ్ చేశారు.

కళ్యాణమండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణమండపం కోసం ఆ సంఘం నాయకులు ఎన్.బి.కే. నారాయణస్వామి రూ.1 లక్ష వితరణగా అందజేశారు. ఈ మేరకు బుధవారం సంఘం ప్రతినిధులకు మొత్తాన్ని అందించారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణమండపం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయల్ గోపాల్, ఆకుల ఉమేష్, విజయ్ కుమార్, నిమ్మకాయల రాము తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

మద్యం వ్యాపారులు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సురక్ష యాప్ పై అవగాహన పెంచుకోవాలని, నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం వ్యాపారులు, బార్ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా "ఏపి ఎక్సైజ్ సురక్ష యాప్" అనే మొబైల్ యాప్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా నకిలీ మద్యం అని అనుమానం వచ్చినప్పుడు మద్యం బాటిల్స్ మీద ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే అసలైనదా, నకిలీదా అని తెలుస్తుందని అన్నారు. ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేసిన వారిని గుర్తించి, నోటీసు ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం అలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు. అలాగే పట్టణంలో ఉన్న మద్యం దుకాణాలు, బార్లలో శాంపిల్స్ సేకరించి కెమికల్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఎవరైనా కల్తీ మద్యం అమ్మినా, తయారు చేసి నిల్వ ఉంచినా వారిపై పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. చిలమత్తూరు మండలం కొడికొండ చెక్ పోస్ట్ లో రామకృష్ణప్ప అను వ్యక్తి 20 హైవార్డ్స్ విస్కీ కర్ణాటక రాష్ట్ర మద్యం కలిగి ఉండగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుల్స్ నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుల్స్ అంజి, రవీంద్ర, కుమార్, రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

భగత్ సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎక్సైజ్ సిఐతో పాటు మాజీ విద్యార్థి సంఘం నాయకుడు వినోద్ కుమార్, ఎన్ లైట్ ఐకాన్ కరస్పాండెడ్ డాక్టర్ సురేష్ ఐకాన్ ప్రిన్సిపల్ బైరిశెట్టి మాట్లాడుతూ, విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, తేజ, గౌరీ శంకర్, కిరణ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.